# కోరిన వరం

ఓ సర్వాంతర్యామీ !

నీకంతా తెలుసు...నీకు తెలియందంటూ యీ చరాచర ప్రపంచంలో యేముంటుంది ? యెట్లా వుంటుంది ! ఉండదు. వుంటే—అయ్యో! నువ్వు సర్వాంతర్యామివి.

నువ్వు కొయ్యముక్క నంటాడు చిరంజీవి. కళ్లు తెరవని పసికూన !...ఇంకేమనగలడు. నువ్వా కొయ్య ముక్కవి! నాకు తెలుసు. భగవాన్ నిన్ను గురించి నాకంతా తెలుసు. పసికూనల మాటలకి కోపం తెచ్చుకోవనీ తెలుసు. దేవుడరుగుమీద నుంచుని యెందుకలా నవ్వుతావు? భగవాన్, యీ చిరుతర మందహాసం యెప్పుడూ నీకు పెట్టని నగగానే అట్టే పెట్టుకుంటావా?

హే చరాచర స్థితిలయ కారణా,

నాదొక్కటే ప్రార్థన. ఒకే ఒక ప్రార్థన. ఇంక నిన్ను ప్రార్థించను....అయ్యో కాదు కాదు భగవాన్ నాలుక తడబడింది. అంతే...నాలుక...నీకు తెలియదూ బుద్ధెరిగిన దగ్గర్నుంచీ రోజూ...ప్రతిరోజూ ప్రార్థిస్తున్నాగా. నిన్నేమీ అడక్కుండా...ప్రతిఫలాపేక్ష లేకుండా...నిష్కామంతో ఎందుకు యితంతా నీతో చెప్పడం? నీకు తెలియదు గనకనా! నేనబద్ధమాడను భగవాన్. అయితే అడిగాననుకో. ఇంటి పెద్ద ఇల్లు

మరిచి ఆ పాడుముండ ఏంబాయో...బాయట...వెధవ....
భగవాన్! కోపం వస్తోందా...మర్చిపోయాను. భగవాన్ నీకు
అందరూ బిడ్డలే. నువ్వు అందరికీ తండ్రివే! ఆఁ, ఆయన
ఆ బ్బాయి ఇంట్లోనే కాలకృత్యాలన్నీ తీర్చుకునేప్పుడు కోరిన
మాట నిజమే. నువ్వు చేసిన మేలు మర్చిపోను బాబూ.
మర్నాటికి పొన్నుకర్ర టకటకలాడిస్తూ వచ్చిన మనిషి
మళ్ళీ ఆ ముండ గడప తొక్కలేదు. చిరంజీవి యేమంటాడో
తెలుసా భగవాన్, దానికి వేరే ఏదో కారణం వుందట.
ఆయన్ని ఆ రాత్రే యెందరో దబాయించారట. ఆ ముండ
దబాయించేవాళ్ళ వెన్ను చరిచిందట. భగవాన్ వాడు పసి
కూన. నాకు తెలియదూ? నిన్ను ప్రార్థించినదానికి, వరమడిగిన
దానికి నాకు తెలియదూ? అంతా నీ మహిమే. ఎన్ని లక్షల
గుర్రాల కళ్ళేలు నీ చేతుల్లో వున్నయ్యో ఆ నెత్తురుగుడ్డుకేం
తెలుసు? అయ్యో అంతా నీకు తెలుసు భగవాన్. నీకంతా
తెలుసు!

ఓహో ఆపద్బాంధవా!

ఆపదొచ్చినప్పుడల్లా...నిన్నెప్పుడూ మరవలేదు. నా
ఆపదలన్నీ తీర్చింది నువ్వు గాదూ. నీ అండ లేకుండా యీ
సంసార నావని యీదగలిగేదాన్నా...నీకు తెలియదూ—
అయితే భగవాన్ నిన్ను పొగుడ్తున్నాననుకోకు. ఈ ఆపద
లన్నీ ఇంత తేలిగ్గా చిక్కుతీస్తావే! ఇదంతా మాయేనా?
ఇదంతా నాకెందుగ్గాని...ఎప్పుడూ నీ దగ్గిరకి ఇలాగే వస్తాను
భగవాన్. తలంటుకుని, చాకలి మడత విప్పి, కట్టుకుని, కుంకుం
పెట్టుకుని, చిక్కుపీడని జుట్టుతో...నీకు తెలియదు గనకనా

...ఇట్లాగే...యిప్పుడు నీముందెట్లా కూర్చున్నానో, అట్లాగే ...అచ్చంగా అట్లాగే వస్తున్నాను. వస్తాను! ఆయ నేమంటారో తెలుసా భగవాన్. మీ దగ్గరకు వచ్చినప్పట్లో వున్న ఉత్సాహంలో వెయ్యోవంతు గూడా వుండదట ఆయన్ని చూసినప్పుడు. వట్టి కొంటె మనిషి భగవాన్. ఆయన యెన్నేళ్ళొచ్చినా పెళ్ళీడు కొచ్చిన మనవాడున్నాడనైనా మానరు ఆ మాటలు. నీకు తెలుసుగా ఆయన నైజం! అంతే యెప్పుడూ అంతే.

యెన్నిసార్లు చెప్పానని? ఏ వయసుకా మురిపెం వుండాలి. యీడు దాటితే కోట దాటుతారు. ఆ చిరంజీవికి మూడు ముళ్ళూ వెయ్యండి అని యెన్నిసార్లు చెప్పాను! యెన్నిసార్లు ... వింటేనా? చెవిని యిల్లు కట్టుకుని పోరాను. ఉహుఁ!

నీ పెళ్ళికి ముందు మీ అమ్మనీ అయ్యనీ నిద్ర పోనిచ్చావని నాకు నమ్మకం లేదు అంటారుగదా! భగవాన్!! దానికీ దీనికీ యేమన్నా సంబంధం వుందా నువ్వే చెప్పు భగవాన్!

నాకు అమ్మా అయ్యా వున్నారు గాబట్టి సరిపోయింది. వాడికి అమ్మా? అయ్యా? వాడు కళ్ళు తెరవకముందే ఇద్దరూ నీ దగ్గరికి వచ్చారు గదా?

హా సృష్టిలయకారణా!!

నీకూ తెలుసునుగా—ఒక్కగాను ఒక్క ఆడబిడ్డ మన వాణ్ణి కన్నది గదా అనుకుంటే యిట్టే యెత్తుకొనిపోతివి—ఈ

దేవుడరుగు ముందు కూర్చుని యెంత ఏడ్చాను. యెంత ఏడ్చినా యేంలాభం? నీ గుండె కరగలేదు.

నాకు తెలుసు, నీ గుండె వెన్నపూసలాంటిదని ... యేంలాభం? అదంతా నీ యిష్టం అనుకుని అల్లుణ్ని తెచ్చుకుని ఇంట్లో పెట్టుకుంటే ఆయన్ని అంతే చేస్తిం – పిల్లణ్ని చూచుకొని ఇంట్లో పెట్టుకుంటే భోరున ఏడ్చాడు. మీకు అప్పగించి వెళ్తున్నానని చెరువైపోయ్యాడు. కోసం 'పెళ్ళి మానుకున్నా'నన్నాడు. పెళ్ళిచేసి ఒక ఇంటివాణ్ని చెయ్యండి అని గడ్డం పుచ్చుకున్నాడు. నీకూ తెలుసుగా......అప్పుడే నీదగ్గరికి పరుగెత్తుకొచ్చానుగా–యేంలాభం!

హుఁ నే భగవాన్, నిన్నేమీ అనటంలేదు. ఏమని యేం లాభం? అప్పటికే అన్నీ అయిపోయె నువ్వుమాత్రం యేం చేయగలవ్. మంచివాళ్ళకీ భూమ్మీద నూకలుండవని నువ్వేగదా అన్నది. అన్నమాటమీద నిలబడ్డావుగదా అనుకున్నాను. అంతే భగవాన్ నిన్ను తిట్టలేదు. తిమ్మాలేదు. యేమీ అనలేదు.

అయితే వాడు—అదే—మా చిరంజీవి పెళ్ళి చేసుకోనంటాడు గదా ఇదేం ఖర్మ భగవాన్! నా మాట మర్చిపోయావా భగవాన్. అందరూ నన్ను ఉమ్మేస్తున్నారు. నీకేం. ఆ దేవుడరుగుమీద నుంచుని సాంబ్రాణి పొగ కళ్ళల్లో కొస్తున్నా అట్లాగే నవ్వుతుంటావయ్యా ... అయ్యో! ... అయ్యో..నీ తలంతా అదేమిటీ నల్లగా కరిధూపం!

ఇక్కడేమీ మసిగుడ్డ కూడా లేదు. యేం పర్వాలేదు.

నా చీర చెరగుతో తుడుస్తాను. కొంగుతో, కొత్తచీర కొంగుతో తుడిచాను. చూశావా నువ్వంటే నాకెంత భక్తో.

ఆఁ! విన్నావా? యీ విడ్డూరం విన్నావా? పెళ్ళి చేసుకోకుండా? మీ తాత వున్నాడా? మీ తండ్రి వున్నాడా? యెవరన్నా పెళ్ళి చేసికోం అన్నవాళ్ళని చూశావురా అంటే ...సంతపాకల్లో వందలకొద్దీ వున్నారంటాడు. అని వూరుకోడు...నవ్వుతాడు...పెళ్ళి చేసుకోనివాళ్ళు బోలెడుమంది వున్నారంటాడు గదా, యెట్లా భగవాన్?

నేను వూరుకోలేదు భగవాన్.... నీకు తెలియదూ నేనూరుకుంటానా...వూరుకుంటే ఎట్లా వూరుకోవాలట ! యెట్లా!! వూరుకోకేఁ? వాళ్ళకి పిల్లలిస్తామన్న వాళ్ళు లేర్రా ...నీకే రారాజువి. పిల్లనీ, పిల్లతో పాటు కట్నాన్నీ ఇస్తామన్న వాళ్లు కోఁ అంటే కోటిమందిరా? అన్నాను. ఒక్కమ్మాయి నేగా నే చేసుకొనేది మిగతా వాళ్ళందరూ యేమౌతా రంటాడు. యీ కాలపు పిల్లలికి నువ్విచ్చిన తెలివేనా అది భగవాన్! అంతా తెలిసి ఇంత అయోమయాన యెలాపడ్డావ్ భగవాన్?

నా వొక్కదాని మాటే కాదు...యెవరి మాటన్నా ఖాతరులేదు. వాళ్ళ పెదనాన్న వచ్చి వంశాన్ని నిలబెట్ట వురా? అని అడిగితే నా పొలం కట్టుబడి చాలటంలేదా అని అడిగాడు. వాళ్ళ పిన్ని వచ్చి 'మీ అమ్మమ్మ ముఖమైనా చూసి చేసుకోరా ఆ మూడు ముళ్లూ చూసి కన్ను మూయ్యా లనుకుంటోంది' అంటే, 'అమ్మమ్మని యింకా పదికాలాలపాటు బ్రతకనివ్వండి ఇవ్వాళే పెళ్ళి చేసుకుంటే రేపే కళ్లు

మూ స్తుందేమో' అంటాడు. చెల్లెలు...దాన్ని కళ్ళల్లో పెట్టుకుంటాడు. అన్నయ్యా వదెన్ని చూడాలనుంది అంటే పట్టు చీర పట్టుకొస్తాలేమ్మా అంటాడు.

యేమిటి భగవాన్! ఇదంతా...యెవరి మాటకీ...యెన్నడూ యెదురు చెప్పనివాడికిదేం గుణం? నీ కాళ్లు పట్టుకుంటాను. ఆ గుణం తీసెయ్యి బాబూ. నీ సంకల్పం లేనిదే గడ్డిపూచ కూడ కదలదు గదా!

అయ్యో కారణ కారణా!

నాకు తెలీకడుగుతాను, ఇవన్నీ నువ్వే అనిపిస్తున్నావా వాడితో! ఓహో చిదచిద్విలాసా!

ఈ మహా కల్పనతో మాయకట్టు కట్టి నాటకమాడిస్తున్నావా నళిననేత్రా! ఆడిన నాటకం చాలదూ.......అసలు ఆ మాటే మరిచిపోయ్యాను. యీ ఆట కట్టిపెట్టు మహానుభావా!

నాకు తెలియదూ......మా చిరంజీవి సంగతి. నోరు తెరచి యెరుగడు. అలాంటివాడు మాటల పుట్టయిపోయె. పెళ్ళి చేసుకోవటమంటే మాటలు కాదట. పెళ్లాన్ని పోషించాలట. (అదెవళ్ళకి తెలియదో. చేసుకున్న వాళ్ళందరూ పోషించటంలా!) బ్రతికినంత కాలమూ పోరపొచ్చాల్లేకుండా బ్రదకాలట. (మేమందరమూ బ్రతకటంలా? అయినా నేనూ యెన్నిసార్లు పోట్లాడుకో లేదు? మళ్ళీ మాట్లాడుకోలా? మళ్ళీ క్రిందా మీదా పడలా!) ఒకళ్ళ గుణాలు ఒకళ్ళకి తెలియాలట. ముందు భాగా తెలిసి వుండాలట. (వాడు చిన్నప్పటి

నుంచీ యెరిగినవాళ్ళు. యెంతమంది లేరు? ఒట్టి పిచ్చివాడు. యెంతమంది స్నేహితులనుకున్నాడు. యెంతమంది మోస పుచ్చారు?...జేబులో పది రూపాయల నోటేసికెళ్ళితే ఇంటి కొచ్చేప్పటికి రాగి దమ్మిడీ వుండదే.....వున్న గుణాలు మారవూ పిచ్చి కాని... తెలీని గుణాల్ని సందేహించేవాడు మారిన గుణాల్లో మెలగ్గలుగుతాడా?)

యెందుకొచ్చిన మాటలూ యివన్నీ? కూటికా? గుడ్డకా? యెందుకు నేర్పావు భగవాన్ యివన్నీ వాడికి?

యేంచెప్పినా వినడాయె. యెట్లా భగవాన్! నీకు పుణ్యం వుంటుంది ఆ శంఖం వూదుదూ...ఆ చక్రం వదులుదూ... ఆ గద త్రిప్పుదూ...ఆ చిరునవ్వు మానుదూ...

అయ్యో...అయ్యో... ఇదేమిటి... ఇట్లాగా నేను ప్రార్థించాల్సింది? అయ్యో! అయ్యో...

ప్రొద్దెక్కింది...ఆయినొచ్చే వేళయ్యింది. విసుగెత్తు తోంది భగవాన్...ఇంకేమీ లేదు...ఆఁ! విన్నావా? నీవు వినకేం. నీకు వినపడం దేముంటుంది గనక! వూళ్లోవా ళ్ళేమను కుంటున్నారో విన్నావా? అది సాగితే యిదెందుకు? అంటు న్నారు. పాపం శమించుగాక భగవాన్,...పాపం ఆ బిడ్డని పట్టుకుని అట్లా నోటికొచ్చినట్లల్లా అంటారుగదా భగవాన్ ఏమనాలి వాళ్ళని?

తల్లీ తండ్రీ లేని అనాథుణ్ణి అట్లా అందరి నోళ్ళల్లోనూ పడేస్తే పుణ్యామా? పురుషార్థమా? నీకు తెలుసునని నాకు తెలుసు భగవాన్

యెన్నెన్నో పడ్డాను. యెన్నెన్నో భరించాను. ఇంక

నావల్ల కాదు...యీ పాడు కాలంలో బ్రతకలేను...నన్నే త్తుకుపో నాయనా...నాకింకా నూకలున్నాయా? అయితే నా మనమడికి, చిరంజీవికి ఆ మూడు ముళ్లూ పడేట్టు చూడు బాబూ.

ఆయనొచ్చే వేళయ్యింది. ఆ వొచ్చేవాళ్ళ పిల్లనన్నా చేసుకునేట్లు చూడు భగవాన్! ఆపిల్ల చక్కనిచుక్క. గోదేవి లాంటిది. వాళ్ళూ వున్నవాళ్లు. కట్నమిస్తారు. వెండిసామాను పెడతారు...వాడు యిష్టపడితే చాలు. కాస్త యిష్టపడమని చెబుదూ...ఇన్ని మాట లనిపించినవాడివి ఆ ఓక్క్ఖ మాటా అనిపించ లేవూ?

నాకు తెలుసు...అంతా...నీకు తెలుసు...నీకు తెలుసని నాకు తెలుసు...నాకు తెలుసు. నువ్వేం చెయ్యమంటే అది చేస్తాను. ఏకాదశి చెయ్యనా? శనివారం ఉండనా? అన్నీ చేస్తాను. ఆ ఒక్కమాట నెగ్గించుదూ, కావలసినన్ని కొబ్బరి కాయలు కొడతాను.

పెళ్లికాగానే వాళ్ళిద్దరితోనూ మొక్కిస్తాను. అంతా నీదే. నీవు మొక్కించుకోవాలనుకుంటే మొక్కనివాళ్లెవళ్లు?

అంతే నే కోరేది ఓ దేవుడా! అలా...ఆc! సురచిర మందహాసం!

సర్వాంతర్యామీ! చరాచర స్థితినిలయకారణా! ఆపద్బాంధవా! కారణకారణా! చిదచిద్విలాసా! మహానుభావా! ఓ దేవుడా!

హే భగవాన్! యీ చిక్కులో చిక్కుకున్న చిక్కును విడదీయవూ?

—::—